కథా నిలయం
695
శ్రీకాకుళం

# భుక్తికోసం

ఆ ఊరుకు మైలుదూరంలో ఓ చెరువుంది. ఆ చెరువుకింద వరిపంట బాగానే పండుతువుంది. ఊరు చుట్టూర నల్లరేగల్లు వుండడంవల్లా మెట్టపంటలు బాగానే పండుతువుంటాయి. అందువల్ల ఆ వూళ్లో సర్కారు రకం పైసపోకుండా వసూలు చేస్తు వుంటారు. ఎంతమంచి భూమి అయినా వర్షం వొస్తేనే కదా పంటలు

పండేది. అదును పదును తప్పినా అప్పెకదా రైతుకు మిగిలేది. ఆ రోజు గ్రామాధికారులంతా చావట్లో కూర్చోని రకం వసూలు చేస్తువున్నారు. తన పొలం బాపతు రకం కట్టడానికి దోసిట్లో సిక్కాలు పట్టుకుని నిలుచున్నాడు చాకల లింగయ్య. ఎన్నిసార్లు కరణానికి పటేలుకు దండం పెట్టినా ఎవ్వరు లింగయ్యవైపు చూడనే లేదు. పేదోని నవ్వు పెదవులమీద ఆరినట్టు అతను పెట్టేదండాలు గాలిలో కలిసిపోతాయి.

''దొర, నారకం తీసుకుండి.'' అన్నాడు లింగయ్య డబ్బులున్న దోసిలితో దండంపెడుతు. అప్పుడు లింగయ్యవైపు మళ్లి ''ఎక్కడిరకం'' అన్నాడు దోసిలివైపు చూస్తు పట్వారి.

''అదె అలుగు పక్క, జాలుపొలంది దొర'' అన్నాడు నవ్వును పూర్తిగ కనపడకుండ ముఖంలోనే దాచుకుంటు.

''అదినీదెందుకాయె'' అన్నాడు తానురాస్తున్న కాగితంవైపు చూస్తు.

''అదె దొర పదియేను ఏండ్లనుండి నేనే సేస్తువస్తున్న. ఏటేటరకం గూడ కడుతున్న దొర'' అన్నాడు లింగయ్య. లింగయ్య కళ్ళల్లో ఏదోబెదురు, వంటిలోవణుకేదో వొనుకు. తనపొలాన్ని తనదికాదంటారేమిటి అని అనుకుంటు తనులోతానె కలవర పడ్డాడు.

''అరె ఆ భూమి నిన్నెవ్వరు చేయమండ్రు. అది చెరువుకింది సిఖం. దాన్ని ఎట్ల సాగు చేస్తున్నవ్ రకం ఎట్లాకడుతున్నవ్'' అన్నాడు పట్వారి ఏది పట్టనట్టు.

''ఊరి పెద్దలంత సేసుకొమ్మంటెనే సేసుకుంటువుంటి. సర్కారు రకం కడుతునేవుంటి. ఏట రకం కట్టిన రసీదులున్నాయి దొర''. తనకేదో కీడురాబోతుందని గ్రహిస్తు ఆందోళనగా అన్నాడు.

''రసీదులు వుంటే ఏందిర, సర్కారుకు డబ్బుకడుతుఅంటే ఎవడన్న

వొద్దంటడ, రకం కట్టినంక రసీదు యియ్యరా'' చావట్లో వేపచెట్టు చుట్టూర వున్న అరుగుమీద కూర్చొని, చిట్టాలు తిరగేస్తు అన్నాడు. ఊళ్లో ఎవని భూమి ఎటు పోయినపట్టువారికి పర్వేవుండదు కొత్తకేసు మొదలయింది. ఇది ఎన్నాళ్ల నడుసుతదాని ఆలోచన తప్పా.

''తమరు, యింకా ఊరి పెద్దలు దున్నుకొమ్మంటేనే దున్నుకుంటి. తైసిల్ల ధరఖాస్తు పెట్టమంటే పెడితి. ఏట రకం కడతేనే ఉంటి, నీకాలు మొక్కుత''

''ఏదో యిన్ని వులువలు చల్లుకుంట అంటే చల్లుకో అన్నం. దాన్ని పొలంజేసిపుట్లు పండియమన్నమా'' తాను చూస్తున్న చిట్టాను మూస్తు లింగయ్య వైపు చూస్తు అన్నాడు.

'ఎంత తిప్పలుపడితే అది పొలం అయ్యింది దొర. వూకనే పండుతున్నయా దొర'' వినమ్రంగా అన్నాడు.

''ఊకె పండకపొతే రేయింపగలు మోటకొడుతున్నవుర. వొట్టి జాలుకు పండుతున్నయి'' అన్నాడు.

''ఊరందరి మురికిని ఉతికే చాకలొన్ని, పెద్దదొరలకు దండంపెడితే సరే చేసుకొమ్మంటిరి''

''ఇప్పుటొద్దు అంటున్నం'' అంటూ తన చేతిగోళ్ళను చూసుకుంటు షాటిల్లో వున్న మైలను వేపపుల్లతో తీసేస్తువున్నాడు. అప్పుడు అతను ఈ ఊరికిగాని ఊరి జనాని కాని పట్టించుకున్నట్టు కనపడడంలేదు. కాని ఈ ఊరికి ఎట్లా నిప్పు పెట్టాలి అన్నట్టు కనపడుతువున్నాడు.

''కట్టకు మట్టి పోస్తున్నప్పుడు అయిన నాలోతు బొందలను కూడపోసి, వర్రెలను సదును చేసి ఎంత కష్టపడితే ఆపొలం అట్లయిందో తమరికి

తెలియందేముంది దొర'' అంటూ చేతులు జోడించాడు.

''చేసినందుకు అప్పటినుండి వొచ్చే పంటలు తింటలేవు'' అన్నాడు. ఈసారి దొర మాటలో ఏదో కటువు తనం వినపడగానే లింగయ్య విస్తుబోయి నిల్చున్నాడు.

''ఆ మాలి పటేలును అడుగుపో'' అన్నాడు విసుగును ప్రదర్శిస్తూ నీకాలు పొక్క_త అన్నట్టు చేతులు జోడించి, మాలి పటేలు దగ్గర్కి వెళ్లి నిలుచున్నాడు.

ఏంసంగతి అన్నట్టు కనుబొమ్మలను ఎగురవేశాడు మాలిపటేలు తన ముందున్న చిన్న రాతపీటమీద రకం కట్టిన వాళ్ళ రసీదులను రాస్తు.

''రకం పటేలా'' రెండు చేతులు జోడించి, రాతబల్లంతా కిందికి వంగి, పటేలు ముఖం వైపు చూస్తు

''రకామా దేనికి'' అన్నాడు తలవంచుకుని రాస్తూనే తన దగ్గరికి వచ్చిన వాళ్లందరి ముఖం చూస్తే తన పని జరగదని అతను ఎవరి ముఖం సరిగా చూడకుండ వుండడం అలవాటు చేసుకున్నాడు.

''అదే నాపొలం బాపతుది పటేలా'' అయ్యా పటువారి అట్ల అంటుండు నీవైన దయతలచుమన్నట్లు చూస్తు అన్నాడు.

''ఆపొలం ఇప్పుడు నీది కాదు నీవు రకము కట్టొద్దు'' అంటూ చావట్లోని ఆదే అరుగు మీది పట్వారికంటే ముందు కూర్చొని రసీదులు రాస్తూనే వున్నాడు.

లింగయ్య బిత్తరపోయి అట్లా కాసేపు నిలుచొని, రైతులను పిలుచుకు రావడానికి వెలుతన్న మస్కూ_రి వెంట నడుస్తు-

'' ఎందుకు ఎంకన్న నారకం తీసుకుంట లేరు'' అని బాధగా, ఆతురతగా అడిగాడు.

చావడినుండి సందులోకి నడుస్తూ మస్కూరి ఎంకలు ''ఆభూమిని నీదగ్గరనుండి కొట్టెయ్యాలని చూస్తుండ్రు, అందుకే రకం కట్టనిస్తలేరు.'' అన్నాడు ఎంకలు అటుఇటు చూసి గొంతు చిన్నగ చేసి.

''నీవు సూస్తలేవా, ఎన్ని బాధలుపడి, ఎంతకష్టపడి ఆ వొర్రెలను వొంపులను ఓరొక్కటెస్తేనే గియాల్ల గిన్ని గింజలు పండుతుంది'' మనస్సులోని మాట మరొకరి చెపితే గుండెలోని బరువు కొంత తగ్గుతుందన్న ఆశలో అన్నాడు.

''సూస్తుంటె, నాదేం సాగుతది, నీవు కూలోనివైతె నేను గులాపోన్ని'' అన్నాడు చేతిలోని బరిసెను సంకలోకి తీసుకుంటు.

'' ఇంత యిద్దైతె ఎట్ల'' అన్నాడు నోటిమీద చేయిని వుంచుకుంటు

'' ఒగనాడు అలుగు సూస్తందుకు సర్కారొలమ్మటి పటేలు, పట్వారి అందరం వచ్చినం. అప్పుడు నీసేను పొట్టతోటింది పచ్చగగుంది. అప్పటినుండె ఆల్లకు కండ్లు మండినయనుకో. దాన్ని ఎట్లన్నసేసి నీకు కాకుంట నెయ్యాలని సూస్తుండ్రు'' నెత్తి రుమాల్లోని మద్రాకును తీసి చుట్ట చేసుకుంటు చెప్పాడు.

''నేను ఊరుకుంటనా, తైసీలుకు పోయి ధరఖాస్తు పెట్టా''

''ధనఖాస్తు పెడితే ఏమైతది. గుతుపున్నోనిది బర్రె. తసిలుదారు ఆల్ల మాట కాదంటడా, అయినా సూడుమరి. ఆల్లయితెని నీ భూమిని కాజెయ్యాలని చూస్తుండ్రు. వస్త యింకా చాలావుందిని పిలుచుకరావాలె.'' అంటు సంకలోని కర్రను చేతిలోకి తీసుకుని అక్కడనుండి కదిలాడు.

లింగయ్య తన యింటివైపు నడుస్తూవున్నాడు. మనస్సు మనస్సులో లేదు. గతంలోకి వెళ్ళింది. చెరువు కట్ట పూర్తి అయింది. సర్కారోళ్ళు

వొచ్చి తూము వొదిలి పోయిండ్రు. ఊరి పెద్దలంతా కట్టమైసమ్మ పండగ చేయిస్తూ అలుగుపక్కన ఉన్న కానుగుచెట్టు కింద మైసమ్మ గుడి కట్టించి, పోతులకోయించి తెల్లందాక పడగ చేయించారు. చాకలి లింగయ్య మంచి యుక్త వయసువుండి పనంతా తానొక్కడే చేస్తువున్నాడు. బోనం వండడం, కల్లుసాగలు పోయడం ఒక్కటేమిటి అన్ని పనులు చకచకచేస్తువున్నాడు. లింగయ్య తండ్రి రంగయ్యది కదలలేని వయస్సు. పండగంత అయినంక, తన కొడుకును తీసుకుని ఊరిపెద్దల శెలవైతే ఈ వర్రెలను సదునుసేసుకుంట, జాలుకు పారితే పారతది లేకపోతే యిన్ని ఉలవలు సల్లుకుంటం దొరలార'' అని ప్రాదేయపడ్డాడు డెబ్బై ఏండ్ల ముదుసలి అందరి ముందు.

''ఆ వర్రెలల్ల ఏముందిర, అది దేనికి అక్కరకు రాదు నీబొందకు తప్పితే'' అన్నాడు పట్వారి

'సరె అందుకయినయియ్యండ్రి గులాపోన్ని'' అన్నాడు రంగయ్య

''రెండెకరాలుందా'' పటేలుతో పట్వారి

''ఆ వుండొచ్చు సదును సేస్తే తెలుస్తుంది''

''ఎంతన్న ఉండని, అటుదాన్ని సేసుకుంటు యిటు మైసమ్మ కావలి, యిక్కడే పడుంటకాల్ మొక్కుత'' అన్నాడు రంగయ్య

''సరే చేసుకోపో'' అన్నారు అందరు.

రంగయ్య కొండంత పెరిగి అందరికి మరోసారి దండంపెట్టి, అక్కడినుండి తండ్రికొడుకులు కదిలి ఆ వర్రెలమీద నిలుచోని ఎంతవరకు పనికొస్తదో అని చూసుకున్నారు. మరునాడే కొడుకు-కోడలు పార, గడ్డపారతో వచ్చి చదును చేయటం ప్రారంభించారు. కొడుకు, కోడలు పనిచేస్తువుంటె రంగయ్య గడ్డమీద

కూర్చుని చూస్తువుండేది. పుట్టి నడకనేర్చినప్పటినుండి సొడుమట్టితో ఆట. పెరిగి పెద్ద అవుతు సొడుమట్టి పిసికే బట్టలుతకడం. యిప్పుడు ఈ మట్టిని చదును చేయడమే. బతుకంతా మట్టితోనే సంబంధం అనుకుంటూ కొడుకు-కోడలు తవ్విన పెడ్డలను చేతులతో చదును చేస్తూ, ఆకరికి ఈ మట్టిలో కలవవలసిందే కదా అని వయస్సుకు దగ్గ భావన కలిగింది ముదుసలి రంగయ్యకు. తృప్తిగ మట్టి పెడ్డలను పరుచుతువున్నాడు. ఈ భూమి తన కొడుకు పట్టా కాబోతుంది అని మురిసాడు. నెలలు గడిచాయి. సంవత్సరం గడిచింది. మూడెకరాలకు పైన చదునైంది. తనయింట్లో పెరిగిన రెండు మేక పోతులు పట్వారి, పటేలు ఇండ్లకు చేరినయి. ఇంటిముందటి చింతచెట్టును ఇంటివెనుక వేపచెట్టును అమ్మినంకా వాటి పైకం వాళ్లకే చేరింది. అప్పుడుకాని రంగయ్య దరఖాస్తు తహశీలు ఆఫీసుకు చేరలేదు. ఆతరువాత చాలరోజులకు రంగయ్యను భూమిలేని పేదగ గుర్తించి ప్రభుత్వం బంజరుభూమిని పట్టాగా ప్రకటించింది. ఆరోజు ఓ మేకపోతును కోసుకున్నారు. కల్లుకుండను తెచ్చుకున్నారు. చుట్ట పక్కాలను పిలుచుకొని పండగ చేసుకున్నారు. ఆరోజు పట్వారి యింటికి ఏటతోడ, పటేలు ఇంటికి కాల్-తలకాయ చేరినయి.

చెరువు జాలును పారించాడు లింగయ్య, ఎరువు ఎంపలి వేసాడు. ప్రతికారు వేస్తునే ఉన్నాడు. ప్రతికారు పండుతునే వున్నది. పనికిరాదనుకున్న భూమిలో పంటొస్తుంది. అందుకే అందరి కళ్ళు మండి యిప్పుడు కాదంటున్నారు. అనుకుంటూ ఇల్లు చేరాడు లింగయ్య. ఏదో ఆలోచిస్తున్న భర్తకు ఎదురొచ్చిన లింగయ్య భార్య.

''ఏందయెు ఎటెటో ఆలోసిస్తువస్తున్నవ్'' అని అడిగింది భార్య

రామక్క. ఆమెకు నలుపై ఏండ్లు. లింగయ్య మౌనంగా లోపలికి నడిచాడు. అతని వెనుకాలె ఆమె నడుస్తూ నడింట్లోకి పోగానె రెక్కపట్టి ఆపి '' అట్లా. అడుగుతుంటే సప్పుడు సెయ్యవ్'' అంటు ముందుకు తిరిగి ఎదురుగ నిలుచుంది. లింగయ్య ఆవెం ముఖంలోకి చూస్తువున్నాడు. అప్పుడు అతని ఎదలోని బాధ సుడులుగ ఎగతోసుకొచ్చి గుక్కతిప్పని ఏడుపుగా బయటకొచ్చింది. భార్య భర్త ముఖంలోని ఆవేదనను చూసి తాను దుఖః బరితురాలై ఆయన ముఖాన్ని తన ఎదమీదుంచుకుని వీపున అరచేతిని రాస్తు ఓదార్చింది రామక్క.

ఒక్కసారి లింగయ్య తలను పక్కకు తిప్పుతు!! నాప్రాణం పోయిన ఆ పొలాన్ని వొదలను'' అని బోరున ఏడిచాడు.

''పొలం! ఏపొలం? ఏమైంది?'' అని అడిగింది

''అదే మన పొలం, పోతదట''

''ఎక్కడ పోతది. రెక్కలు ముక్కలు చేసుకొని, సెట్టుకొట్టి, సేమకొట్టి, ఒర్రె గూడిపి పంపు గూడిపి పదేండ్లనుండి సాగు సేస్తువచ్చింది ఊరకనే పోతదా?'' అని ఎదమీది మగని తలను తన ముఖం ఎదురుగ తిప్పుకొని, కళ్లలో చూస్తూ అంది. లింగయ్య కాస్త కుదుట పడ్డాడు. ఆమె చూపులు, ఆమె స్పర్శ అంతవరకు కుదిపిన బాధను కాస్త తగ్గించింది. ఆరోజంతా ఆపొలం గురించి ఆలోచనలోనే సొమ్మసిల్లిపోయాడు.

రామక్క ఆపని ఈపని చేస్తుందన్న మాటేకాని ఆమె ఆలోచనంతా గూడా పొలం గురించే. ఆ ఇద్దర్కి ఆ రాత్రి నిద్ర సరిగా రాలేదు. అర్ధరాత్రి లేచి మధ్య పడుకున్న ఏడేండ్ల కొడుకును చూసుకుంటూ ''పొలం పోతె ఎట్లా, వీడు పెద్దై ఏం సంపాయించినవు అయ్యా

ఏసెపుతం'' అన్నాడు లింగయ్య.

''ఎక్కడ పోదు మొదట మన ప్రాణం పోతనే కదా ఆపొలం పొయ్యేది'' అంది.

''అంతె నంటవా'' అంటు అమాయకంగా చూశాడు లింగయ్య. రామక్కకు తనమొగుడు ఎప్పుడు పులిలాగ కనిపించేది. ఎంతో ధీమాగా చూస్తూ, ఎంతో గంభీరంగా మాట్లాడేది. ఈ రోజు యింత మెతకపడిపోయాడేమిటి. కష్టపడి సాధించుకున్న పొలం ఎట్లా పోతది. వాళ్ల కళ్ళుమండి కాజెయ్యాలని స్తూస్తువుంద్రంతే. ఒకవేళ్ళ ఆభూమినే కాజేస్తే ఈ ఊరి నడిబొడ్డు రక్తం కాలువై పారాలంతే! అని అనుకుంది. అలాంటి ఆలోచనతోనే ఆరాత్రి గడిచింది.

బట్టలుతికి, పొలం పని చేసుకుని బతికే ఆమెకు అంత తీవ్రమైన ఆలోచన ఎందుకొచ్చిందో మరి!

••••

ఆ తర్వాత ఎవ్వరు ఆవిషయం ఎత్తలేదు.

రకమూ తీసుకోలేదు.

ఆతర్వాత పంట వచ్చే వరకు పొలానికి నీరు పెట్టనిచ్చారు.

చేను బాగ కాసి కోతకొచ్చింది.

పొద్దంతా కోసి, మెదను పొలంలోనె వుంచి లింగయ్య ఇంటికొచ్చి తిని, కాసేపు కునుకు తీసి పోయె సరికి-

మళ్ళలో వరి మెదల్లేవు!

వరం మీద నిలబడి గుండె బాదుకున్నాడు. కుక్కలు మొరిగినా కనుక్కోపోతి గదా అని అంగలార్చాడు.

ఊళ్లోకి పరుగునొచ్చి మొదట భార్యకు చెప్పాడు. ఆతరువాత

ఊరంతా చెప్పాడు. ఇది పట్వారిపనే అని పసి కట్టారు. కాని పట్వారి తన ఇంట్లో లేడు. ఆ రాత్రి దొర ఇంట్లో ఓదేవత పేరుమీద తిండి తాగుడు వుంది. పట్వారి అక్కడేవున్నాడు. వరిమెదలు తెచ్చినందుకు జనం వస్తరని తనకుతెల్సు. అందుకే అక్కడికి చేరుకున్నాడు. ఊరంతా కలిసి దొరోని గడిమీద పడ్డారు. గడికాపలాదారులు తుపాకులు పేల్చారు. జనం రాళ్ళు రప్పలు రువ్వారు. క్రీనీడన వెళ్ళిన రావుక్క ఓకాపలాదారుని తుపాకిని గుంజుకుంది. చిమ్మచీకటి, ఎదురైనోన్ని మల్లబెట్టి మడిమతో కొట్టింది. ఇద్దరు కాపలాదారులు నేలకూలారు. వారో తుపాకి చేజిక్కించుకుంది. అవసరం అన్నింటిని సాధిస్తుందనటానికి ఆమె సాహసమే నిదర్శనం.

అందరిని బెదదిరిస్తూ యింకెవరి దగ్గరనైనా తుపాకులుంటే ఒక్కచోట వేయవల్సిందిగా గద్దించింది. అంతే కాదు తుపాకిని పైకెత్తి ట్రిగ్గర్ నొక్కింది.

'ధన్' మన్న చప్పుడు!

పైన వేపచెట్టు మీది కొంగ ''గప్పు''న కిందపడింది.

ఇక అంతే ''అమ్మో ఈమె ఎవరో గురి తెలిసిన మనిషి, తుపాకులున్నయి'' అని అర్ధరాత్రి గడిలో అందరు ఉరుకులు పరుగులు. కొందరు భయంతో వణుకుతు దిడ్డి దర్వాజన పరుగెత్తి ఊరవతల చేలో దాక్కున్నారు. దొరసానిని గదిలోపల వదిలి దాసి దాంతో పడుకున్న గదిముందు దొర మనుషులు నిల్చొని-

''దొర ఆయుధాలతో గడిమీద అమ్లుజేసింద్రు'' అన్నారు.

''అవును దొర మన తుపాకులు గుంజుకున్నరు'' అన్నారు.

''ఎవరో ఓ స్త్రీ గడిగోడమీద నిలబడి మిమ్ముల పట్టుక

రమ్మంటుంది. ఆమె చేతిలో తుపాకీ గూడ వుంది'' అన్నారు.

''నన్నా'' అంటు గడ్డరిమి పిస్టల్‌కోసం వెతికాడు. అది ఆగదిలో కనిపించలేదు. దొరసాని గదిలో చూడమన్నాడు. అక్కడ లేదని దొరసాని కళ్ళు నలుపుకుంటూ వచ్చి చెప్పింది.

''మరి ఎటుపోయినట్టు''? అని విసుక్కున్నాడు.

అక్కడ వెలిగే నూనె దీపాలను ఆర్పేశారు. అంతటా చిమ్మచీకటి.

భయంతో తొందర తొందరగా బట్టలు చుట్టుకొని బయట పడ్డాడు. ఆయన వెనకాల ఆయన భార్య పరుగెడతూ -

''ఏమండీ మీరు కట్టుకున్నది దోతికాదు'' అంది మెల్లగా.

''ఏదోవోటిరా'' అని సైగ చేశాడు.

''పిస్తోలు కనిపించలేదు''

''అదే నేను ఆలోచిస్తున్నా''

''వాళ్ళైతే మన అ(రలకాయి రాలేగా''

''రాలేదు''

''నడువ్, నడువ్ ఉర్కురా'' అంటూ దిడ్డి దర్వాజవైపు పరుగులాంటి నడక. దొర మనస్సంతా ఆందోళనగా వుంది. ఆ తుపాకీ పట్టుకుని నిలబడ్డది ఎవరబ్బా? ఆ లింగని పెండ్లం చాకలి రామేనా? అది తుపాకీ పట్ట ఎప్పుడు నేర్చె. ఆడది మగోల్లను కొట్టి తుపాకి గంజుకుంటుంటే ఈ నాకొడుకులు ఏంజేస్తుండ్రో. ఇంత బతుకు బతికి ఇంటెనకంగ పారిపోవలసి వచ్చెగదా! అనుకుంటూ ఊరి పొలిమెర దాటారు.

జనం గడి తలుపులు తెరిచి వరిమోపులను మోసుక పోతున్నారు. గడి అంతా గందరగోళమై పోయింది.

గడిబురుజుమీద రామక్క తుపాకిని పట్టుకొని నిలుచొని చుట్టు చూస్తూ వుంది. ఆమె నిలుచున్న గోడ పక్క ఎవరో ఏడ్చినట్లు శబ్దమొస్తె ''ఎవరు'' అంటూ కిందికి చూసింది.

గోడ నీడలో ఓ స్త్రీ

''ఎవరు'' అంది మళ్ళి తానె.

''దాసిని''

''ఎందుకేడుస్తున్నావ్''

'' నేనూ గడిదాటి బయటకొస్త, ఇదిగో'' అంటూ ఓ తోలు సంచిని అందించింది.

రామక్క సంచిని అందుకుని, అందులో ఏముందా అని చూసింది. దాన్నిండా పిస్టల్లో దట్టించే బుల్లెట్లు వాటి మధ్యన ఓ పిస్తోలువుంది. విషయం గ్రహించిన రామక్క ''పద, బయటకు నడిసి మందిలో కలువ్'' అంది పిస్తోలను రొండిన చెక్కుకుంటు.

ఆ తరువాత వరంతా మోసినాక గడితలుపులు బిగించి తమ వాడవైపు నడిచారు.

అప్పుడు ఊరు ఊరంతా మేల్కొనే ఉన్నారు.

కొంతసేపటి తరువాత కోడికూడ కూసింది.!

•1997